ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- రాష్ట్రంలో నీట్(యుజి)2026 పునః పరీక్ష ఈరోజు ప్రశాంత వాతావరణంలో జరిగింది.
- ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు.
- రాష్ట్ర వ్యాప్తంగా రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈరోజు నిర్వహించింది. యోగా గురువు బాబా రాందేవ్ సమక్షంలో పలువురు యోగాసనాల సాధన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌తో రాందేవ్ బాబా ప్రాణాయామం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి చొరవతోనే ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని, ప్రపంచానికి మార్గనిర్దేశం చేయగల 'విశ్వగురు' సామర్థ్యం ఒక్క భారతదేశానికే ఉందన్నారు. రసాయన రహిత ఆహారాన్ని అందించేందుకు రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఒక గంట పాటు యోగా కోసం కేటాయించాలని, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…20 సెకన్లు)

====================

యోగ సాధనతో మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక సమతుల్యత సాధ్యమని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ లోక్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని యోగ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి ఫలితంగా ఐక్యరాజ్య సమితి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించిందన్నారు. యోగా అంటే వ్యాయామం కాదని, ఒక జీవన విధానమని పేర్కొన్నారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమన్వయాన్ని నెలకొల్పే మహోన్నత సాధనమే యోగా అని అన్నారు.

====================

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా ఆయన పోస్టు పెట్టారు. యోగా అనేది భారతదేశ నాగరికతా జీవన విధానంలో ఒక అంతర్భాగమని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి భారతదేశం అందించిన ఒక అమూల్యమైన కానుక యోగా అని అభివర్ణించారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యత, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు.

====================

ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈరోజు విశాఖపట్నం సాగరతీరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని, దాని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

====================

రాష్ట్రంలో నీట్(యుజి)-2026 పునః పరీక్ష ఈరోజు ప్రశాంత వాతావరణంలో జరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్షను నిర్వహించారు. రాష్ట్రం నుండి 65వేల 790 మంది అభ్యర్థులు నీట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం 185 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

====================

యోగా సాధన వల్ల మానసిక ..శారీరక దృఢత్వం లభిస్తుందని, అందరూ యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలోని గాంధీ పార్కులో జరిగిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో ప్రపంచంలోని 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని అన్నారు.

====================

విరామం

====================

గుంటూరు నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. వందలాదిమందితో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఇతర ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శరీరం - మనసు - ఆత్మ మధ్య సమతుల్యతను తీసుకువచ్చే జీవన విధానమన్నారు. నేడు 177 దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం భారతదేశానికి గర్వకారణమని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

====================

యోగా సాధనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఒంగోలులోని పోలీసు కవాతు మైదానంలో ఈరోజు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యోగాను ప్రధానమంత్రి విశ్వవ్యాప్తం చేశారని అన్నారు. పూర్వీకులు మనకు అందించిన ఈ యోగాను మనం నిత్యం సాధన చేయాలని, యోగా సాధనతో మంచి ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్నారు.

====================

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (AOB) ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు సంయుక్తంగా జరిపిన దాడిలో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పరిధిలోని అరకు నియోజకవర్గం, ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు వద్ద ఈరోజు నిర్వహించిన దాడిలో సుమారు 5 కోట్ల 60 లక్షల రూపాయల విలువైన ఒక వెయ్యి 125 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

====================

రాష్ట్ర వ్యాప్తంగా రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమలలో ఈనెల 23వ తేదీ వరకు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని, కోస్తా జిల్లాల్లో వేడి, తేమతో కూడిన ఉక్కపోత వాతావరణం ఉంటుందని ఎం. వెంకట్రావు పేర్కొంటూ...

(వాయిస్...24 సెకన్లు)

=====================

రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఈరోజు 12వ అంతర్జాతీయ యోగాంధ్ర-2026 దినోత్సవం సందర్భంగా ఏలూరులో యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యోగాంధ్రతో రాష్ట్ర ప్రజలు ఆరోగ్యం వైపు అడుగులు వెయ్యాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యోగా ఆరోగ్య వంతమైన నవసమాజ నిర్మాణానికి దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయం కేటాయించాలన్నారు. యోగా ఒక ఆధ్యాత్మిక సాధనం అని, ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు.

=====================
=====================